

తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎన్నారై కో ఆర్డినేటర్ మహేశ్ బిగాల

## విద్యుత్ కాంట్రాక్టర్ల సమస్యలు పరిష్కరించాలి



నేమాల బెనర్జీని సన్మానిస్తున్న విద్యుత్ కాంట్రాక్టర్ల సంఘం నాయకులు

సిటీబ్యూరో, జనవరి 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని బి గ్రేడ్ విద్యుత్ కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారానికి సంఘం కృషి చేస్తుందని తెలంగాణ బీ గ్రేడ్ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నక్క యాదగిరి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని అశోకా కాన్ఫరెన్స్ హాలులో సంఘం సమావేశాన్ని నిర్వహించి, డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ లైసెన్సింగ్ బోర్డు మెంబర్‌గా ఎన్నికైన నేమాల బెనర్జీని సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ .. కాంగ్రెస్ ప్రభుత్వం కాంట్రాక్టర్ల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు రఘు, సయ్యద్ భాషా, మల్లేశ్ యాదవ్, ఉదయ్‌భాస్కర్, బాల్‌రెడ్డి, ఆర్.శ్రీనివాస్, గోవర్ధన్, కాళి నాయుడు, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

బుద్వేల్ రైల్వే స్టేషన్‌తో నాగోల్ - కొత్త హైకోర్టు మెట్రో మార్గం అనుసంధానం

# ఒకే చోట బహుళ ప్రజా రవాణా వ్యవస్థ

ప్రతిపాదిత మెట్రో మార్గాల్లో కొనసాగుతున్న అధికారుల అధ్యయనం

సిటీబ్యూరో, జనవరి 21 (నమస్తే తెలంగాణ): నగరంలో వాయు కాలుష్యం తీవ్రత తగ్గాలన్నా..? వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని తగ్గించాలన్నా..? రోడ్లపై ట్రాఫిక్ సమస్యలు లేకుండా ఉండాలన్నా..? ప్రజా రవాణా వ్యవస్థలే అంతిమ పరిష్కారం. ఒకే చోట అనుకూల, వేగవంతమైన బహుళ ప్రజా రవాణా వ్యవస్థలను అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వం ముందున్న ఏకైక లక్ష్యం. ఆర్టీసీ బస్సులు, రైల్వే, మెట్రో రైలు... ఇలా మూడు ప్రజా రవాణా వ్యవస్థలను ఒకే చోటు నుంచి నగర ప్రజలు వినియోగించుకొనే అవకాశం కల్పించనున్నారు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం నగరంలో కొత్తగా ప్రతిపాదించిన 5 మెట్రో మార్గాల్లో మెరుగైన ప్రజా వ్యవస్థను అందుబాటులోకి తీసుకుచ్చేందుకు చర్యలు చేపట్టింది.

### కొత్తగా ప్రతిపాదించిన మెట్రో మార్గాలు... (76 కిలోమీటర్లు)

1. మియాపూర్–చందానగర్–బీహెచ్‌ఈఎల్– పటాన్‌చెరు (14 కి.మీ)
2. ఎంజీబీఎస్–ఫలక్‌నుమా–చాంద్రాయణగుట్ట–మైలార్‌దేవ్ పల్లి–పీ7 రోడ్డు– ఎయిర్‌పోర్టు (23 కి.మీ).
3. నాగోల్–ఎల్‌బీనగర్ మీదుగా చాంద్రాయణగుట్ట–మైలార్‌దేవ్ పల్లి–ఆరాంఘర్– రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పక్కన కొత్తగా నిర్మించే రాష్ట్ర హైకోర్టు స్థలం వరకు (19 కి.మీ).
4. మెట్రో కారిడార్–3ని పొడిగిస్తూ రాయదుర్గం మెట్రో స్టేషన్ నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్‌లోని విప్రో సర్కిల్ వరకు (12 కి.మీ)
5. ఎల్‌బీనగర్–వనస్థలిపురం–హయత్‌నగర్ వరకు (8 కి.మీ)



నాగోల్ టూ హైకోర్టు మెట్రో మార్గంలో..

నగరానికి తూర్పు దిక్కు ఉన్న నాగోల్‌తో పాటు దక్షిణాన ఉన్న రాజేంద్రనగర్, ఆరాంఘర్‌లను కలుపుతూ కొత్తగా ప్రతిపాదించిన 19 కి.మీ మెట్రో మార్గంలో 3 జాతీయ రహదారులు, 2 రాష్ట్ర రహదారులు, ఆర్టీసీ, రైల్వే స్టేషన్‌ను కలిపేందుకు ఉన్న అవకాశాలను మెట్రో అధికారులు క్షేత్ర స్థాయిలో గుర్తించారు. ముఖ్యంగా హైదరాబాద్–బెంగళూరు జాతీయ రహదారిపై ఆరాంఘర్, బుద్వేల్ వద్ద రైల్వే స్టేషన్‌లతో లింకు కలుపడం ద్వారా ఎక్కువ మంది ప్రయాణికులకు ప్రయోజనం కలుగుతుంది. అలాగే హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై ఎల్‌బీనగర్ వద్ద, హైదరాబాద్–బెంగళూరు జాతీయ రహదారిపై ఆరాంఘర్ వద్ద.. మెట్రో స్టేషన్‌లు నిర్మిస్తే ప్రయాణికులకు అనుకూలంగా ఉంటుంది. నగరం నుంచి నాగార్జున సాగర్ హైవేలో రాకపోకలు సాగించే వారికి సాగర్ రింగు రోడ్డు వద్ద మెట్రో స్టేషన్ అవసరమని, కావాల్సినంత స్థలాన్ని సేకరించేందుకు ప్రాధాన్యతనివ్వాల్సి ఉంటుందని మెట్రో అధికారి తెలిపారు.

### ఇంటర్‌చేంజ్ స్టేషన్‌గా చాంద్రాయణగుట్ట

నాగోల్–ఎల్‌బీనగర్–మైలార్‌దేవ్‌పల్లి–ఎయిర్‌పోర్టు లైన్‌లో ఉన్న చాంద్రాయణగుట్ట వరకు ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా మీదుగా వచ్చే మెట్రో మార్గాన్ని మరో ఒకటిన్నర మీటరు మేర చాంద్రాయణగుట్ట వరకు పొడిగించి, పాతబస్తీకి ఎయిర్‌పోర్టుకు మెట్రో కనెక్టివిటీ కల్పించి ఇంటర్‌చేంజ్ స్టేషన్‌గా చాంద్రాయణగుట్టను పరిగణలోకి తీసుకొని అధ్యయనం చేయాలని మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి సూచనలు చేశారు. రెండు వైపుల నుంచే మెట్రో మార్గాలు చాంద్రాయణ గుట్ట చౌరస్తాలో కలపాలంటే ఇప్పటికే అక్కడ ఉన్న ఫ్లై ఓవర్ బ్రిడ్జీ ప్రధాన అడ్డుగా ఉందని గుర్తించారు. కొన్ని మీటర్ల దూరం ముందుకు తీసుకువెళ్లి ఇంటర్‌చేంజ్ మెట్రో స్టేషన్‌ను నిర్మిస్తే శ్రీశైలం హైవే, చార్మినార్, ఫలక్‌నుమా నుంచి వచ్చే వారికి ఉపయోగకరంగా ఉంటుంది.

### కీలకంగా మారనున్న బుద్వేల్ రైల్వే స్టేషన్..

మహానగరం నుంచి దక్షిణ భారత దేశం వెళ్లే రైళ్లు ఎక్కువగా ఫలక్‌నుమా–బుద్వేల్ మీదుగా బెంగళూరు,తిరుపతి, కేరళ వంటి ప్రాంతాలకు వెళుతుంటాయి. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే రైల్వే ప్రయాణికులు బుద్వేల్ రైల్వే స్టేషన్‌లో దిగి, దానికి ఎదురుగా నిర్మించే హైకోర్టు మెట్రో స్టేషన్‌కు చేరుకునేందుకు కేవలం 200 మీటర్ల దూరమే ఉంది. రాజేంద్రనగర్ వ్యవసాయం విశ్వవిద్యాలయం ఎదురుగా ఉన్న జాతీయ రహదారిని ఇప్పటికే 6 లేన్ల ఎక్స్‌ప్రెస్‌వేగా నిర్మించడంతో మెట్రో స్టేషన్ నిర్మాణానికి భూసేకరణ సమస్య ఉందని అధికారులు సర్వేలో గుర్తించారు. బుద్వేల్ నుంచి ఆరాంఘర్ వెళ్లే మార్గం 2 కి.మీ లోపే ఉండటంతో పాటు శివరాంపల్లి ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ సైతం సమీపంలోనే ఉంది. ఒకే చోట ప్రజా రవాణా వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు అనుకూలంగా ఉందని మెట్రో అధికారులు సర్వేలో గుర్తించారు.

### మైలార్‌దేవ్‌పల్లిలోనూ మెట్రో ఇంటర్‌చేంజ్ ..

ఎయిర్‌పోర్టుకు మెట్రో రైలు కనెక్టివిటీలో భాగంగా మైలార్‌దేవ్‌పల్లి వద్ద రెండు మెట్రో మార్గాలు వస్తుండటంతో ఇక్కడ మరో ఇంటర్‌చేంజ్ స్టేషన్‌ను నిర్మించాల్సి ఉంటుందని మెట్రో అధికారులు గుర్తించారు. నాగోల్ నుంచి, ఫలక్‌నుమా వైపుల నుంచి వచ్చే మెట్రో రైళ్లు మొదట చాంద్రాయణగుట్ట వద్ద కలిసి అక్కడి నుంచి మైలార్‌దేవ్ పల్లికి వచ్చిన తర్వాత ఒక మార్గం ఎయిర్‌పోర్టు లోపలికి, రెండో మార్గంలో ఆరాంఘర్ మీదుగా కొత్త హైకోర్టు వరకు వెళుతుంది. ఫలక్‌నుమా నుంచి వచ్చే రైల్వే మార్గం ఈ మెట్రో స్టేషన్‌కు సమీపంలోనే ఉండటంతో భవిష్యత్తులో ఇక్కడ ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్‌ను నిర్మించవచ్చని మెట్రో అధికారులు పేర్కొంటున్నారు. ఇలా క్షేత్ర స్థాయిలో మెట్రో రూట్‌లలో కీలకమైన ప్రాంతాలు, రోడ్డు, రైలు మార్గాలను మెట్రోతో అనుసంధానం చేసే అంశాలను ప్రత్యేకంగా గుర్తించి నివేదికను రూపొందిస్తున్నారు.

■ క్యాలెండర్ ఆవిష్కరణ



తెలంగాణ భవన్‌లో హెచ్ఎండబ్ల్యూఎస్, ఎస్‌బీ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, యూనియన్ అధ్యక్షుడు పి.నారాయణ, ప్రధాన కార్యదర్శి బి.కిరణ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజారత్నం, సంతోష్, సురేశ్, నిజాంపేట్ మేయర్ నీలాగోపాల్ రెడ్డి తదితరులు - చిక్కడపల్లి, జనవరి21

## ఘనంగా 'లిటిల్ మ్యుజీషియన్స్ అకాడమీ'వేడుకలు

హాజరైన ఎమ్మెల్యే హరీశ్‌రావు



లిటిల్ మ్యుజీషియన్స్ అకాడమీ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో ప్రసంగిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు

కొండాపూర్, జనవరి 21 : ప్రముఖ సంగీత అకాడమీ లిటిల్ మ్యుజీషియన్స్ అకాడమీ.. బాల గాంధర్వం సిల్వర్ జూబ్లీ వేడుకలు ఆదివారం మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరై..మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, చిన జీయర్ స్వామి, శోభారాజు, వరప్రసాదరెడ్డిలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పరిచయం అక్కరలేని గొప్ప సంగీత గురువు, లిటిల్ మ్యుజీషియన్స్ అకాడమీ వ్యవస్థాపకుడు కొమాండూరి రామాచారి, ఆయనది నిత్య స్వర ప్రపంచమని తెలిపారు. చదువు భారంతో విసిగిపోతున్న బాల్యానికి రామాచారి సంగీతం అనే ఉల్లాసాన్ని, వికాసాన్ని అందించడం అభినందనీయమన్నారు. సంస్కార భరితమైన సంగీతాన్ని నేటి తరం బాలలు ఆదరించడం అదృష్టమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టాలీవుడ్ ప్రముఖులు, నిర్మాతలు, డైరెక్టర్లు, సింగర్లు పాల్గొని సందడి చేశారు.

## ఘనంగా తెలుగు సంగమం సంక్రాంతి వేడుకలు



వేడుకల్లో భాగంగా భక్త ప్రహ్లాద నాటకం ప్రదర్శిస్తున్న కళాకారులు

మణికొండ, జనవరి 21: మానవ చరిత్రలో వేద సంస్కృతి అతి ప్రాచీనమైనదని, వేదం నుంచి ఏర్పడ్డ మొదటి భాష సంస్కృతం కాగా.. సంస్కృతం తరువాత లోకానికి చేరిన భాష తెలుగు అని త్రిదండి చిన జీయర్ స్వామి పేర్కొన్నారు. ఆదివారం నార్సింగిలోని ఓం కన్వెన్షన్‌లో నిర్వహించిన తెలుగు సంగమం సంక్రాంతి సమ్మేళనం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చిన జీయర్ స్వామి, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, మిజోరం గవర్నర్ హరిబాబు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, ప్రముఖ నాట్యకారిణి కళాకృష్ణ, సంపత్‌కుమార్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తెలుగు వాడిగా పుట్టడం ఎన్నో జన్మల పుణ్యమన్నారు. సమ్మేళనంలో గంగిరెద్దుల విన్యాసాలు, పేరిణి ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మధ్యప్రదేశ్ బీజేపీ ఇన్‌చార్జి మురళీధర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకుంటున్న హెచ్‌యూఈ ఎగ్జిబిషన్

దేశ వ్యాప్తంగా 33 మంది ఆర్ట్ వర్క్స్



ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న సినీ నిర్మాత దగ్గుబాటి సురేశ్

సిటీబ్యూరో, జనవరి 21 (నమస్తే తెలంగాణ): దేశ వ్యాప్తంగా 33 మంది ప్రముఖ ఆర్టిస్టుల నుంచి జాలువారిన చిత్రాలు 'హెచ్‌యూఈ( హౌస్ ఆఫ్ యునిఫైడ్ ఎక్స్‌ప్రెషన్)' పేరుతో కొలువుదీరాయి. ఈ ఆర్ట్ ఎగ్జిబిషన్ ఈనెల 28 వరకు ఫిలింనగర్‌లోని స్పిరిట్ స్పేస్‌లో అందుబాటులో ఉంది. ఈ ప్రదర్శన కార్యక్రమాన్ని ప్రముఖ సినీ నిర్మాత దగ్గుబాటి సురేశ్ ప్రారంభించారు. మొత్తం వంద అద్భుతమైన ఆర్ట్స్‌ను ప్రదర్శనలో ఉంచారు. ఈ ఎగ్జిబిషన్‌కు క్యురేటర్‌గా అన్నపూర్ణ వ్యవహరిస్తున్నారు. ఈ ప్రదర్శనలో వైకుంఠం, తరణి, సుబోధ్ కేర్కర్, రాజేశ్వర్ రావు, ప్రసన్న, బీపీ రెడ్డి, సిర్కార్, పుల్కిత్, జగదీష్ వంటి సుప్రసిద్ధ సమకాలీన కళాకారుల కళాఖండాలు ఉన్నాయి. ఈ సందర్భంగా దగ్గుబాటి సురేశ్ మాట్లాడుతూ హైదరాబాద్.. కళను ఆరాధించే నగరమని కొనియాడారు. ప్రతి ఒక్క ఆర్టిస్టు తమ ఆలోచనలను చిత్రాల రూపంలో ఆవిష్కరించడం గొప్ప విషయమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఏక్‌చిత్ర కో ఫౌండర్ రాజ్ కుమార్ సింగ్, రాజీవ్ రంజన్ తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ మొబైల్ స్క్రీనింగ్ బస్సు ప్రారంభం





క్యాన్సర్ మొబైల్ స్క్రీనింగ్ బస్సును ప్రారంభిస్తున్న ఎస్‌బీఐ సీజీఎం రాజేశ్ కుమార్, బసవతారకం ఆస్పత్రి చైర్మన్ నందమూరి బాలకృష్ణ

బంజారాహిల్స్, జనవరి 21: క్యాన్సర్ లక్షణాలను ముందస్తుగా గుర్తించేందుకు బంజారాహిల్స్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రికి అత్యాధునిక మొబైల్ స్క్రీనింగ్ బస్సును స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో అందుబాటులోకి తీసుకువచ్చారు.ఆదివారం బంజారాహిల్స్‌లోని ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చైర్మన్, నటుడు నందమూరి బాలకృష్ణతో కలిసి ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేశ్ కుమార్ ప్రారంభించారు. రూ.1.60 కోట్ల విలువైన మొబైల్ స్క్రీనింగ్ బస్సు కోసం ఎస్‌బీఐ రూ.1.5 కోట్లను సీఎస్ఆర్ కింద అందజేసిందని ఆస్పత్రి చైర్మన్ నందమూరి బాలకృష్ణ తెలిపారు. ఈ మొబైల్ బస్సులో అత్యాధునిక డిజిటల్ ఎక్స్‌రే, మామోగ్రఫీ, అల్ట్రాసౌండ్ యంత్రాలతో పాటు క్యాన్సర్ నిర్ధారణకు ప్రాథమిక పరీక్షలకు కూడా సదుపాయాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి అసోసియేట్ డైరెక్టర్ డా. కల్పనా రఘునాథ్ మాట్లాడుతూ ఆస్పత్రి క్యాన్సర్ స్క్రీనింగ్ విభాగం ద్వారా ఇప్పటికే 1177 ఉచిత స్క్రీనింగ్ క్యాంపులు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ జితేందర్‌కుమార్ శర్మ, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి బోర్డు సభ్యులు జేఎస్ఆర్.ప్రసాద్, డా.ఫణి కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

## నుమాయిష్‌లో సండే సందడి



నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో కిక్కిరిసిన సందర్శకులు

అబిడ్స్, జనవరి 21: నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో కొనసాగుతున్న అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనలో సండే సందడిగా కనిపించింది. నగరం నలుమూలల నుంచి వేలాదిగా సందర్శకులు తరలి రావడంతో మైదానం సందర్శకులతో కిక్కిరిసి పోయింది. శనివారం నాటికి ఏడు లక్షల అరవై వేలు, ఆదివారం దాదాపు ఎనభై వేల మంది ఎగ్జిబిషన్‌ను సందర్శించినట్లు ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు వనం సత్యేందర్ తెలిపారు. సందర్శకుల రద్దీ పెరగడంతో స్టాళ్లలో కొనుగోళ్లు జరుగుతున్నాయి.

## ఆకట్టుకున్న గుజరాతీ ఏక్తా మహోత్సవాలు



ఏక్తా మహోత్సవ్ ఉత్సవాల్లో భాగంగా వివిధ వేషధారణలో విద్యార్థులు

బేగంపేట, జనవరి 21: తెలంగాణ గుజరాతీ సమాజ్ వారి ఆధ్వర్యంలో గుజరాతీ ఏక్తా మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం సికింద్రాబాద్ రాష్ట్రపతి రోడ్డులోని గుజరాతీ స్కూల్ ప్రాంగణంలో ఏక్తా మహోత్సవ్ పేరిట రామాయణానికి సంబంధించిన వివిధ రకాల అంశాలను 11 విభాగాల్లో బృందాలు నృత్య ప్రదర్శన చేసి ఆహూతులను ఆకట్టుకున్నారు. నేడు అయోధ్యలో రాముడి విగ్రహ ప్రతిష్ఠాపనను పురస్కరించుకొని ఈ ఉత్సవాలను ప్రారంభించినట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ గుజరాతీ సమాజ్ అధ్యక్షుడు ప్రేమల్ పరేఖ్, ఉపాధ్యక్షుడు చందులాల్ పటేల్ పాల్గొన్నారు.

పనిమనిషి వివరాలిస్తామంటూ..

## సైబర్ మోసం

బంజారాహిల్స్, జనవరి 21: పనిమనిషి కోసం ఆన్‌లైన్‌లో సెర్చ్ చేస్తున్న ఓ వ్యక్తిని సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టించి డబ్బులు కాజేశారు. ఈ ఘటన బంజారాహిల్స్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నం. 10 నివాసి యష్ దవే ఓ ప్రైవేటు సంస్థలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. తన ఇంట్లో పని మనిషిని పెట్టుకోవాలనే ఉద్దేశంతో ఆన్‌లైన్‌లో సెర్చ్ చేస్తున్న క్రమంలో కోమల్ అనే యువతి ఫోన్‌చేసి.. తమవద్ద పనిమనుషులు ఉన్నారని, వారి వివరాలు పంపించాలంటే రూ.2వేలు ఇవ్వాలని కోరింది. దీంతో యష్ దవే రూ.2 వేలు పంపించగానే ఫోన్ నంబర్ బ్లాక్ చేసుకుంది. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు ఆదివారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ధర్మ రక్షణకు యాగం అవసరం



యాగం నిర్వహిస్తున్న స్వామీజీలు

కవాడిగూడ, జనవరి 21 : సమస్త మానవాళి శ్రేయస్సు, దేశ, ధర్మ రక్షణ కోసం ఎవరికి వారు యాగం చేయాల్సిన అవసరం ఉన్నదని సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి పేర్కొన్నారు. శ్రీ సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి 88వ అవతరణ సందర్భంగా.. కుర్తాళం శ్రీసిద్ధేశ్వర పీఠం ఆధ్వర్యంలో ఆదివారం ఎన్‌టీఆర్ స్టేడియంలో ఈ నెల 21 నుంచి 28 వరకు నిర్వహించ తలపెట్టిన కోటి ప్రత్యాంగిరా మహా యాగాన్ని స్వామీజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అయోధ్యలో రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా 22న 108 నదీ జలాలు, ఐదు సముద్రాల నుంచి ప్రత్యేకంగా తీసుకువచ్చిన జలాలతో శ్రీరామ సామ్రాజ్య పట్టాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుర్తాళం శ్రీ సిద్ధేశ్వర పీఠం ఆస్థాన పండితులు రమేశ్ శర్మ, రమ్యానంద భారతి స్వామిజీ పీఠం కో–ఆర్డినేటర్ శ్రీనివాస్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ శశిభూషణ్‌తో పాటు భక్తులు పాల్గొన్నారు.




ఆదివారం ముషీరాబాద్ వాలీబాల్ గ్రౌండ్‌లో తెలంగాణ తమిళ సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతిని పురస్కరించుకొని తమిళ కుటుంబాలు టగ్ ఆఫ్ వార్ ఆడారు

## మిద్దె తోటలతో బహుళ ప్రయోజనాలు

అగ్రికల్చర్ సైన్సెస్ డీన్ డాక్టర్ రాజారెడ్డి

మేడ్చల్, జనవరి 21 : మిద్దె తోటలతో బహుళ ప్రయోజనాలు పొందవచ్చని మల్లారెడ్డి విశ్వ విద్యాలయం స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ సైన్సెస్ డీన్ డాక్టర్ రాజారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని మల్లారెడ్డి వ్యవసాయ విశ్వవిద్యాలయంలో శనివారం ఏరువాక ఫౌండేషన్ ఆధ్వర్యంలో మల్లారెడ్డి యూనివర్సిటీ సహకారంతో నిర్వహిస్తున్న కిసాన్ మహోత్సవంలో భాగంగా ఆదివారం మిద్దె తోటలు, ఆరోగ్య అలవాట్లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ.. అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ మిద్దె తోటలపై దృష్టి సారించాలన్నారు. మిద్దె తోటల ద్వారా రసాయనిక మందులు లేని కూరగాయలు, ఆకు కూరలను పండించుకోవచ్చన్నారు. తద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. అంతేగాకుండా ఆర్థికంగా లాభపడవచ్చని, ఉదయాన్నే మిద్దె తోటల్లో పని చేయడం ద్వారా కసరత్తు జరుగుతుందన్నారు. అభిరుచి ఉన్న గృహిణిలతో పాటు ఉద్యోగం చేసే మహిళలు సైతం హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు, వైజాగ్ తదితర పట్టణాల్లో మిద్దె తోటల సాగుతో లబ్ధి పొందుతున్నారని చెప్పారు. అల్యూమినియం పాత్రల్లో కంటే కంచు పాత్రల్లో ఆహారాన్ని వండుకోవడం మంచిదని ప్రకృతి ప్రసాద్ తెలిపారు. అనంతరం విజయవంతంగా మిద్దె తోటలను సాగు చేస్తున్న మహిళలను అవార్డులతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏరువాక ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రాఘవరావు, విశ్వవిద్యాలయ అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ప్రకృతి ప్రసాద్‌ను సన్మానిస్తున్న అగ్రికల్చర్ సైన్సెస్ డీన్ రాజారెడ్డి, ఏరువాక ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రాఘవరావు తదితరులు